

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 9 జనవరి, 2013 సంచిక : 8

(నందన నామ సం॥, మాఘ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి | రూ॥ | 6/- |
| వార్షిక చందా | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
శుభాశీస్సులు ........ 3
శ్రీ సాయి సేవ ........ 5
కబీరు అమృతవాక్కులు ........ 7
కన్నీట కడిగిన పాపం ........ 8
మాతృసంస్థ కబుర్లు ........ 10
అలనాటి వీరయువకుల ........ 25
బాలవాణి ........ 29
విద్య ........ 31

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com









# మా వాణి



ప్రియ పాఠకులందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు.

జనవరి అనగానే నాకు గుర్తు వచ్చేవి రెండు. ఒకటి మనకు గణతంత్రం వచ్చిన నెల. రెండు సాయివాణి జన్మదినం. 1990 జనవరి ఒకటవ తేదీన పరమపూజ్య గురుదేవుల కరకమలాల మీదుగా ప్రారంభమైన యీ పత్రిక పాఠకుల అభిమానం వలన, సహాయకుల స్నేహోదరాల వలన యింతదైంది. ఈ సంవత్సరం దీని తరఫున ఒక క్రొత్త పుస్తకం రానున్నది. సాయివాణి సంపాదకీయాలలో (మావాణి) అనేకమంది అభిమానానికి పాత్రమైన కొన్ని వ్యాసాలు విడిగా తీసి ఒక పుస్తకంగా తెమ్మని శ్రీ రాజన్న గారు (సాయివాణికి క్రమం తప్పని పాఠకులు-అభిమానులు-సహస్ర మాసజీవి) పదేపదే అంటూ ఉంటారు. గురుదేవులు కూడా ఇటీవల యిదే ఆజ్ఞ యిచ్చారు. అంచేత త్వరలో యీ పుస్తకం వస్తుందనే ఆశిస్తున్నాము.

పాఠకుల నుండీ యీ జన్మదిన సందర్భంగా సాయివాణి ఒకటి జరిగితే బాగుండునని ఆశిస్తున్నది. మీరు మీ యిళ్లలో ఏదైనా ఉత్సవాలు జరుపుకొనేటప్పుడుగానీ, మీ మిత్రుల జన్మదినాల వంటి సందర్భాలలోగానీ ఏదైనా బహుమతి యివ్వదలచుకొన్నపుడు సాయివాణి ఆజీవ సభ్యత్వం రూ.600/-లు చెల్లించి వారి చిరునామా పంపితే వారికి పదేళ్లపాటు పత్రిక అందుతుంది. మిమ్మల్ని వారు ప్రతినెలా తలుచుకొంటూ ఉంటారు. అంతేకాక మీకు తెలిసిన పాఠశాలలకుగానీ, దేవాలయాలకుగానీ, సత్సంగాలకు కూడా యీ పత్రిక అందేలాగా మీరు సహకరించవచ్చు. కనీసం ఐదేళ్లకు కట్టినా కొంత మేలు. చదివిన వారికి, సహకరించిన వారికీ కూడా శ్రీ సాయి ఆశీస్సులుంటాయి. అలాగే సాయితో మీమీ

అనుభవాలు వ్రాసి పంపండి. తప్పకుండా ప్రచురిద్దాము.

జనవరి 26 గణతంత్రదినం నాటికి మన రాజ్యాంగంలో సెక్యులర్ అన్న పదానికి వివరణ ఏమిచ్చారో ఒక్కసారి వెదికి, లేదా చరిత్ర, రాజకీయ సంబంధిత విద్య నేర్చిన వారిని అడిగి ఒక్కసారి తెలుసుకోండి. దాని మీద మీ అభిప్రాయాలు మాకు పంపితే ప్రచురిస్తాము.

అలాగే సాయివాణితో మీకు గల అనుబంధాన్ని, మీకు తోచిన మంచి చెడులను (నిర్మొహమాటంగా) విశ్లేషించి వ్రాయండి. ఎల్లవేళలా మీ ఆదరాభిమానాలు సాయివాణి పట్ల యితోధికంగా ఉండాలని మా కోరిక. ఈ పత్రిక మీకు యితోధికంగా ఉపకరించే స్థాయికి ఎదుగుతూ ముందుకు నడవాలని శ్రీ సాయినాధుల మ్రోల తలవాల్చి నమస్కరిస్తూ

- మీ సంపాదకులు



## శుభాశీస్సులు



రామలింగంపల్లె వాస్తవ్యులు చి॥ ఎర్రహేమంతరెడ్డి, చి॥సౌ॥ ఉజ్వలలు. ఈ యిద్దరూ శ్రీ సాయి విద్యాధామం పూర్వ విద్యార్థులు. ముఖ్యంగా హేమంతరెడ్డి పసితనం నుండీ పదో తరగతి వరకూ యిక్కడే చదువుకున్నాడు. హేమంత్ తల్లిదండ్రులు శ్రీమతి రాణి, శ్రీ రంగారెడ్డి కూడా ఆశ్రమ అభిమానులే. వారు హేమంత్, ఉజ్వలల వివాహం 2012 అక్టోబరు 27వ తేదీన కె.బి.ఆర్. ఫంక్షన్ హాల్, కళ్యాణ మంటపంలో శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ నవవధూవరులు పరస్పరానురాగంతో, సత్సంతానంతో కలకాలం వర్ధిల్లాలని సాయివాణి ఆశీస్సు.

శ్రీ సాగి జగన్నాథరాజు, వారి యిల్లాలు శ్రీమతి విజయకుమారీ దేవి ఆశ్రమానికి చిరకాల అభిమానులు. మంచి భక్తులూను. శ్రీ జగన్నాధరాజుగారు శ్రీ ఆనందంగారికి ఇంజనీరింగులో శిష్యుడు





కూడా కావటం వలన సంస్థతో అనుబంధం మరింతగా పెంచుకున్నారు. ఈ దంప తులు తమ చిన్న కుమారుడు చి॥ రవితేజవర్మ వివాహక్రతువు చి॥సౌ॥ శ్రావ్యతో నవంబరు 1వ తేదీ రాత్రి గం.11.05 ని.లకు విశాఖపట్నంలో అంగరంగవైభవంగా నిర్వహించారు. నవదంపతులు ఒకరికొకరుగా - ఇద్దరూ ఒక్కటిగా చిరకాలం జీవించి, సత్సంతానాన్ని లోకకళ్యాణ కారకులైన తీరులో పెంచి ధన్యులు కావలసిందిగా గురుదేవుల దివ్యాశీస్సులు.

శ్రీ మండవ రామకృష్ణయ్యగారు, వారి కుమారుడు శ్రీ గంగాధర్ గారు ఆశ్రమానికి అభిమానులు. గంగాధర్‌గారు (జెర్సీ మిల్క్స్) మంచి వదాన్యులు కూడా. శ్రీమతి రమాకుమారి, గంగాధర్‌గారలు తమ చిన్న కుమారుడు చి॥ కృష్ణ చైతన్య కళ్యాణం చి॥సౌ॥ సౌమ్యతో నవంబరు 24వ తేదీన బళ్లారి జిల్లా హొస్పేటలో వైభవంగా నిర్వహించారు. ఈ నవదంపతులు పరస్పర అవగాహన, అనురాగాలతో తమ జీవితాలను ఆనందమయం చేసుకోవాలనీ, తమ సంతతిని లోకకళ్యాణార్థమై జీవించే సద్ధర్మపరులుగా పెంచి ధన్యులు కావాలనీ పరమపూజ్య గురుదేవులు తమ శుభాశీస్సులు అందిస్తున్నారు.

డా॥ ముక్తేశ్వర్రావుగారు వృత్తిరీత్యా వైద్యులు. ప్రవృత్తిరీత్యా గొప్ప సామాజిక స్పృహ ఉన్న ధర్మాభిమాని. అలుపెరుగని కార్యకర్త. శ్రీ ముక్తేశ్వరరావుగారు, వారి శ్రీమతి హేమలతగారలు తమ కుమార్తె చి॥సౌ॥ మహతికి చి॥ వినీత్‌తో నవంబరు 29వ తేదీ రాత్రి గం.9.14ని.లకు హైదరాబాదులో శాస్త్రోక్తరీతిన కళ్యాణక్రతువు నిర్వహించారు. వధూవరులు తాము నేర్చుకొన్న సంస్కారాలను నిత్యం స్మరిస్తూ ఒకేమాట, ఒకేబాటగా జీవిస్తూ, తమ సంతతిని దేశోపకారకులుగా రూపొందే రీతిలో పెంచి, భరతమాత ఋణం తీర్చుకోవాలని పరమపూజ్య గురుదేవులు తమ ఆశీరక్షతలు చల్లుతున్నారు - తథాస్తు!

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

ఉదాహరణకు వరద వస్తోంది. జనం కొట్టుకుపోతున్నారు. అప్పుడు ఏదీ గుర్తు రాదు - వాళ్లను రక్షించాలనేది తప్ప, ఒకవేళ తనకు ఈత రాకపోతే ఈత వచ్చిన వాళ్లను పిలుచుకు రావడానికైనా పరుగెట్టాలి. రెండూ లేనివాడు సేవా రంగానికే పనికిరాడు. రక్షించడాన్ని (సేవను) బాధ్యతగా ఫీలవడం కూడా చాలా అవసరం సేవకునికి.

మా ఆశ్రమంలో ఒక ఉత్సవం జరుగుతోంది. ప్రక్కనే వంట పందిళ్లలో గ్యాస్ పొయ్యి మీద పెద్ద మూకుట్లో పోసి ఉన్న నూనె ఎక్కువగా మరిగి మండటం ప్రారంభమైంది. వంటవాళ్లంతా పారిపోయారు భయపడి. అది చూచి ఉత్సవంలో ఉన్న ఒక వ్యక్తి పరుగున వెళ్లి రెగ్యులేటర్ పీకేసి సిలెండర్ దూరంగా విసిరి పడేసాడు. అతనా పని చేయకపోతే పెద్ద అనర్థం వాటిల్లేది సిలెండర్ పేలిపోయి.

ఆ క్షణంలో అతనికి తన ఉద్యోగం, భార్యా పిల్లలు, ప్రమాదమేమోనన్న అనుమానం ..... యివేమీ గుర్తు రాలేదు. ఇదే బాధ్యతగా ఫీలవటం అంటే. వందలాది మంది ప్రాణాలు రక్షించినట్లు అతని చర్యతో.

సేవకు ఎల్లలు లేనట్లే రంగాలు కూడా లేవు అనుకోవాలి. పది మందికి మేలు చేయటం కోసం తాను ఎంచుకొన్న రంగంలో నిజాయితీతో పని చెయ్యటం సాయి సేవకుడికి అవసరం. ఈ విషయంలో మన పూర్వులెందరో మనకు ఆదర్శప్రాయంగా నిలుస్తారు.

ఉదాహరణకు టంగుటూరి ప్రకాశం పంతులుగారు తమ జీవిత కాలమంతా స్వాతంత్ర్యోద్యమంలోనూ, వ్యవస్థా నిర్మాణంలోనూ, ఆంధ్ర





దేశాభివృద్ధి కోసమూ ఎంతో కృషి చేసారు. తన లా ప్రాక్టీసు ద్వారా లక్షలాది రూపాయలు (ఆ కాలంలో) ఆర్జించారు - మళ్లీ సమాజం కోసం ఖర్చు చేసేసారు. ఆయన వృద్ధాప్యంలో ఒకరోజు ఏదో రైల్వేస్టేషన్‌లో రైలు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. దగ్గర తనకెప్పుడూ తోడుగా ఉండే వెంకటేశ్వరరావు గారున్నారు.

పంతులుగారికి ఆకలైంది కాబోలు - "వెంకటేశ్వర్రావ్! అరటిపళ్లేమైనా దొరుకుతాయేమో చూడరా!" అన్నారు.

టిక్కెట్టు కొన్నాక ఇంక వెంకటేశ్వర్రావు దగ్గర కూడా కొద్దిగా చిల్లర తప్ప ఏమీ మిగల్లేదు. ఏమీ మాట్లాడలేకపోయాడతను. ఇదంతా గమనిస్తూ పరిస్థితి అర్థం చేసుకున్నాడు స్టేషన్ మాస్టర్.

"నాకు ఇంటి దగ్గర్నుండి కేరియర్ వచ్చింది వెంకటేశ్వర్రావుగారూ! నాక్కాస్త పనిబడింది. ఇంటిదాకా వెళ్లి రావాలి. ఎలాగూ వెడుతున్నానుగా... నేను అక్కడ తింటాను. మీరు పంతులుగారికి భోజనం పెట్టండి ముందు. పాపం పెద్దతనం కూడా" అన్నాడు కేరియర్ అందించి.

వెంకటేశ్వర్రావు కన్నీటి పర్యంతమయ్యాడు. "మహోజ్జ్వలంగా ఓ వెలుగు వెలిగిన ప్రకాశం పంతులుగారికి ఈ దీనావస్థా!". అతను గబగబా విస్తరి కడిగిపెట్టి కేరియర్ మూత తీస్తున్నాడు. అంతలో

ఓ రైతు ప్రకాశం గారిని చూచి పరుగున వచ్చి కాళ్లకు చుట్టుకుపోయాడు. "పంతులుగారూ, ఎన్నేళ్లకు చూసానండీ!" అంటూ. వీరు అతన్ని గుర్తు పట్టి, క్షేమ సమాచారాలన్నీ అడిగి తెలుసుకున్నారు.


"రైతుల కష్టాలేం చెప్పమంటారండీ బాబూ! మీతోనే ఎళ్లిపోయిందండీ మా ప్రభ! రెండు పూటలా పొట్టకూ, గుడ్డకే చాలని కాలం వచ్చేసిందండీ!" అన్నాడతను దీనంగా.

"ఇంతకీ అన్నం తిన్నావటరా?" అడిగారు ప్రకాశం గారు. అతనికి కన్నీళ్లు వచ్చాయి. "మూడోపూటండీ మెతుకుముట్టి" అన్నాడు తలవంచుకొని. పంతులుగారు వెంటనే, "ఇదుగో వెంకటేశ్వర్రావ్! ముందు వీడి

"సంగతి చూడరా! వాడికి వడ్డించెయ్యి" అనేసారు.

కడుపారా అన్నం తింటున్న ఆ నిరుపేద రైతును చూచి మనసారా ఆనందించారు. తాను ఆకలితో ఉన్నారు. అది తప్ప తనకు తిండి లేదు. బాగా వృద్ధులు అయినా సరే - తమ త్యాగబుద్ధి చూపించుకోగలిగా రాయన. కారణం - కరుణతో మనసు కరగటం. ఆ కరుణకు మూలం ఆయన మనసులో ఉన్న సహజప్రేమ. అలా ప్రేమ, త్యాగం జమిలిగానే ఉంటాయి-ఎక్కడైనా, ఎప్పుడైనా సేవకు పునాది ప్రేమేనన్నది నిర్వివాదాంశం.

**(సశేషం)**



## సర్వం సాయిమయం

# కబీరు అమృతవాక్కులు

సేకరణ : శ్రీ తిరుమలశెట్టి వేంకట సుబ్బారావు, కొవ్వాడ

కబీరు నోటి నుండి అమృతవాక్కులా వెలువడిన దోహా -

దోహా॥ గురు పారస్, గురుపరస్ హై, చందన్‌బాస్ సుబాస్ ।
సత్‌గురు, పరాస్ జీవ్‌కో, దీన్హో ముక్తి నివాస్ ॥

సద్గురువు 'పరుశువేది రాయి' లాంటివాడు. ఆ పరుశువేది స్పర్శతో, ఎలాటి ఇనుము, లోహం అయినా బంగారంలా మారిపోతుంది. చందన శీతలమైన స్పర్శ వంటి సద్గురు స్పర్శ వలన శిష్యుడు ఆత్మైకానుభవము, ఆత్మజ్ఞానము పొంది, సంసార సాగరాన్ని తరిస్తాడు.

సద్గురువు సాన్నిధ్యం సర్వపాపాలు పోగొడ్తుంది.

సాయి శరణం - బాబా శరణం.

బాబా శరణం - సాయి శరణం.





# కన్నీట కడిగిన పాపం



- స్వామి వివేకానంద జీవితం నుండి

స్వామీ వివేకానందులు మనందరికి తెలిసిన ఒక గొప్ప యోగి. కానీ ఆయనలో ఉన్నటువంటి ఆంతరంగిక మృదుత్వం గురించి తొందరగా ఎవ్వరికీ అర్థం కాదు. ఎప్పుడూ దేశం గురించి చింతించటమేకాక ఎదుటి వారి యొక్క బాధను తన బాధగా స్పందించేవారు. వివేకానందస్వామి ప్రతి జీవిలోను పరమాత్ముడిని దర్శించిన మహనీయుడు. ఆయన లోకకళ్యాణం కోసం ప్రపంచమంతటా సంచరించినారు. ఎప్పుడూ దేశం గురించీ, ధర్మం గురించీ ఆలోచించేవారు.

ఒకసారి ఆయన అమెరికా వెళ్ళి భారతదేశానికి తిరిగి ప్రయాణం అయి వస్తూ త్రోవలో కైరోలో ఆగారు. అప్పుడు ఒక సంఘటన జరిగింది. ఈ సంఘటన ద్వారా ఆయన దయార్ద్రహృదయం ఎటువంటిదో తెలుస్తుంది. స్వామీజీ తన యొక్క ప్రియమైన శిష్యులు, స్నేహితులతో కలిసి మాట్లాడుకుంటూ వీధిలో వెడుతూ ఉన్నారు. వీరికి ఆ ప్రదేశం క్రొత్తదవడం వలన వీరు దారితప్పి వేశ్యలు ఉన్నటువంటి వీధిలోకి వెళ్లబోయారు. శిష్యులకు తాము వెళ్లేటటువంటి దారి సరిఅయినది కాదనీ, వారు వెళ్లకూడని చోటుకు వెళ్లామనీ కొంతసమయం తరువాత అర్థమయింది. అప్పుడు శిష్యులు స్వామీజీని అక్కడ నుండి తీసుకొని వెడదామనుకున్నారు. కానీ స్వామీజీ తనంతట తాను శిష్యులను, స్నేహితులను వదిలి, వేశ్యలకు దగ్గరగా వెళ్లడం మొదలుపెట్టారు.

అక్కడ అరుగుల మీద సగం బట్టలతో వికారపు అలంకరణతో వేచి చూస్తున్న ఆ స్త్రీలు వికారపు చేష్టలతో స్వామీజీని రమ్మని పిలుస్తున్నారు.

వారిని చూస్తూ స్వామీజీ తనలో తానే "ఓసి నా పిచ్చి తల్లుల్లారా! ఏమిటీ గతి మీకు! మీ అందమయిన దివ్యాత్మలను ఎందుకు యీ దేహసౌందర్యం మాటున ఈ విధంగా పాడుచేసుకుంటున్నారు? అయ్యయ్యో!" స్వామీజీ తమలో తామే గొణుక్కుంటూ కన్నీళ్ళు కారుస్తూ బాధపడుతున్నారు. కానీ ఆ స్త్రీలకు వేశ్యావృత్తి తప్ప వేరే ఆధారం లేదు. వారు పెద్దగా ఏమీ చదువుకోలేదు. ఎప్పుడెప్పుడు ఎవరు వస్తారు ఎలా తిండి దొరుకుతుంది - అని ఎదురుచూడటం తప్ప వారికి మరొక మార్గం లేదు. ఈ మానవజన్మ ఎంతో విలువైనది, దానిని సన్మార్గంలోకి తీసుకువెళ్లాలన్న విషయాలపైన వారికి ఏ మాత్రం అవగాహన లేదు - అర్థం చేసుకోలేరు. కానీ వివేకానంద స్వామీజీ యొక్క గొప్పతనం వలన, ఆయన తేజస్సు వలన, ఆయనను చూచినటువంటి ఆ స్త్రీల యొక్క మనస్సుల్లో కూడా సంచలనం అనేది వచ్చింది. ఆ స్వామీజీ పలుకులు విన్న మహిళలు కొందరు సిగ్గుతో తల వంచుకున్నారు. కొందరు మహిళలకు స్వామీజీని చూడగానే అమితమైనటువంటి ఆనందం, స్వామి మీద భక్తి కలిగాయి. ఒక స్త్రీ స్వామీజీ యొక్క ఒంటిపైనున్నటువంటి వస్త్రపు అంచును తాకి ముద్దు పెట్టుకుంది. "ఇతను దేవుడిని చూసిన మనిషి" అని ప్రక్కకు తిరిగి ఇతరులతో అన్నది. కొందరు స్వామీజీని దగ్గరగా చూడగానే సిగ్గుతో, భయంతో తలవంచుకొని ప్రక్కకు వెళ్లిపోయారు. మరొకామె స్వామీ వివేకానందుని చూచి "ఇతను మనిషి రూపంలో ఉన్నటువంటి దేవుడు" అని ముఖానికి చెంగు అడ్డం పెట్టుకొని ఏడవసాగింది. స్వామీజీ హృదయంలో సాటి మానవాళిపై ఉన్న ప్రేమ, కరుణ ఎదుటివారిలో ప్రతిఫలించి యిలా వారిలోని మానవత్వాన్ని, దైవీ గుణాలను తట్టిలేపేవి.





# మాతృసంస్థ కబుర్లు

నవంబరు 12 నరక చతుర్దశి. ముందరిరోజు బడి, ఇల్లు, లైబ్రరీ, గోశాల వగైరాలన్నీ దులిపి, కడిగి శుభ్రం చేసుకోవటంతో గడిచిపోయింది. నరకాసురుడిని తయారుచేసి, చొక్కా, పేంటూ వేసారు పిల్లలంతా కలిసి. పెద్దలందరినీ ఆహ్వానించి నరకదహనం చేసారు. నరకాసురవధను గురించిన కథ, సత్యభామ అతన్ని చంపినతీరు వివరించారు గురుదేవులు. నరకుని తల్లి భూదేవి అనీ, ఆవిడే సత్యభామగా అవతంరించిందనీ, మాతృ హస్తాలలో తప్ప మృతిలేని వరం నరకునికి ఉండటం చేత శ్రీకృష్ణుని చేతిలోకాక సత్యభామ చేతిలో చావవలసి వచ్చిందనీ వివరించారు. తరువాత మాతాజీ "నరకం అంటే మురికి. మురికి నేలలో నుండే వస్తుంది. దానిని తిరిగి భూమే తనలో లయింపజేసుకొంటుంది. అదే నరకవధ వెనుక ఉన్న రహస్యం. అంతేకాదు ఎవరి మనసులో పుట్టిన దురాలోచనలను వారే నాశనం చేసుకోవాలి. ఎవరి చేతల వలన కలిగే దుష్ఫలితాల కర్మఫలం వారే అనుభవించాలి. మన మనసు చేసే దురాలోచనలు ప్రక్కవారు ఆపలేరు గదా- మనమే తొలగించుకోవాలి. సత్యభామ తన కొడుకు దుష్టుడైనపుడు తానే స్వయంగా చంపిందన్న యీ కథ నుంచీ మనం నేర్చుకోవలసిందిదే" అని వివరించారు. తదుపరి అందరూ గీతక్క చేసిచ్చిన సున్ని ఉండలు ఆరగించారు. ఆ సాయంత్రం ఇందిరత్తయ్య, రవీంద్ర మామయ్యలు (ఒక చక్కటి విద్యాలయాన్ని నిర్వహిస్తున్న ఆశ్రమభక్తులు) టపాకాయలు తెచ్చారు. అంతకుముందే ఈసారి టపాకాయ లకు ఏమీ ఖర్చు చెయ్యవద్దు-ఆ డబ్బు వరద బాధితులకు పంపుదామని అందరం కలిసి నిర్ణయించుకున్నాం. కానీ, యీ టపాకాయల రాకతో "మనం కొనలేదుగా" అని చిన్న సవరణ చేసుకొని, మనసును సరిపెట్టు కున్నారు

మా వానరులు.

13వ తేదీ సాయంత్రం లక్ష్మీపూజ జరిగింది. దీపావళి మా పరమ గురువులు (గురుదేవుల గురువులు) దత్త ఉపాసకులు శ్రీశ్రీ మాణిక్యరాయ శర్మ మహరాజు వారి పుణ్యతిథి. అందుచేత వారి పటాన్ని కూడా అర్చించు కున్నాము. సాయి మందిరం, దత్త మందిరం, భరతమాత మంటపం, ఉ ష తదితర భవనాలన్నీ దీపాలతో అలంకరించాక-గోవిందరావు తాతయ్య తెచ్చినవీ, నిన్న వచ్చినవీ కలిపి వీరావేశంతో కాల్చేసి (మధ్య మధ్య వేళ్ళూ, కాళ్ళూ కూడా కొద్దిపాటి రేంజ్‌లో కాల్చుకొని) మిఠాయి తిని చల్లబడ్డాయి మా (చిరం)జీవులన్నీ.

నవంబరు 19వ తేదీ ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి. 177 ఏళ్లనాడెన్నడో పుట్టి 22 సంవత్సరాల ప్రాయంలోనే దేశమాత పాదాలకు రక్తపారాణి పూసి చిరకీర్తినార్జించుకున్న పుణ్యమూర్తి ఝాన్సీ లక్ష్మీబాయి. ఆమె పేరిట వ్యాసరచన పోటీ నిర్వహించబడింది శ్రీ సాయి విద్యాధామంలో. అదేరోజు సాయంత్రం బొమ్మల రామవరం (మండల కేంద్రంలో) శ్రీ రామాలయంలో ఏర్పాటైన సభలో శ్రీ వివేకానందస్వామిని గూర్చీ, లక్ష్మీబాయి గురించీ ఉపన్యాసాలు ఇవ్వబడ్డాయి. మొదట శ్రీ సాయినాథుల ముందర దీపారాధన చేసి ఝాన్సీ లక్ష్మీబాయి, వివేకానందుల పటాల ముందు కూడా దీపం పెట్టారు. యువచేతన ప్రారంభోత్సవంగా ఏర్పాటైన యీ సభకు బాల బాలికలే విశేషసంఖ్యలో హాజరవటం, యువతలో స్పందన గణనీయంగా తగ్గటం విచారకరమే అయినా కొందరిలోనైనా అది మిగిలినందుకు సంతోషించాం. కొద్దిపాటి భజన తరువాత గురుదేవులు వివేకానంద జయంత్యుత్సవ ప్రాధాన్యం గురించి, దేశానికి ముఖ్యంగా యువతకు వారు చూపిన మార్గదర్శకత్వం గురించి సంక్షిప్తంగా వివరించారు. అటుపైన మాతాజీ లక్ష్మీబాయి చరిత్రను, ఆమె గుండెనిండా అమృతాన్ని, అరచేతిలో అగ్నిజ్వాలలను ధరించిన జీవనశైలి గురించీ,





ఆమె దేశభక్తినీ, వీరత్వాన్నీ, నాయకత్వ లక్షణాలనూ వివరించి, ఆ నారీమణి స్థాయినీ, నేటి యువతుల మానసిక స్థితిగతులను, దిగజార్చుకొంటున్న విలువలను ప్రస్తావించి, సంస్కృతీ సంప్రదాయాలను నాశనం చేసుకోకుం డానే జాతిని రక్షించు కోగల స్థైర్యం నేటి యువత సంతరించుకోవాలని ప్రబోధించారు. తదుపరి శ్రీశైలంగారి వందన సమర్పణ, వచ్చిన రెండు వందల మందికీ ప్రసాద వినిమయాలతో సభ ముగిసింది. ఏర్పాట్లకు తమ టెంట్ హౌస్ సామగ్రినిచ్చి సహకరించారు శ్రీ భాస్కర్‌గారు. ఈ కార్యక్రమం రాంబాబు శ్రీ కె. చంద్రారెడ్డిగారు, సాయిచంద్ర, శ్రీ సాయి విద్యాధామం విద్యార్థుల సహకారంతో నిర్వహించాడు.

నవంబరు 21 గోదావరీ సీమకు నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం. ఆశ్రమానికి బహుకాల అభిమానులు శ్రీమతి శేషారత్నం, శ్రీ కృష్ణారావు (కొమ్ము)గారలు తమ స్వస్థలమైన పెదపట్నం (తూర్పుగోదావరి జిల్లా)లో తమ సొంతచోట్లో శ్రీ సాయి దేవాలయం నిర్మించతలపెట్టారు. దానికి శంకుస్థాపన గురుదేవుల చేతుల మీదుగా జరగాలని వారు కోరిన మీదట-స్వామీజీ తమ బృందంతో 21 రాత్రి బయలుదేరి వెళ్లారు. పాలకొల్లు స్టేషన్‌లో దిగింది మొదలు పెదపట్నం చేరేవరకు త్రోవకు రెండు వైపుల ఆకాశంలోకి తలలెగరేస్తూ నిలుచున్న కొబ్బరిచెట్ల బారులు, నీళ్లతో నిండి పరుగులు తీసే పంటకాలువలు, పసుపువన్నెకు తిరిగి, బంగారు జరీ పట్టుచీర కట్టుకొన్న పూర్ణ గర్భిణుల్లాగా ఒదిగి నిలబడిన వరిచేలు-తెలుగు గడ్డకే అలంకారంగా ఉండే గోదావరీ సీమ సొగసులు చూస్తూ ప్రయాణించాము.

మధ్యాహ్న భోజనాల తరువాత అంతర్వేది చూడాలని బయలుదేరాము. సముద్రతీరంలో ఉన్న చాలా పురాతన నృసింహక్షేత్రం అంతర్వేది. ఇది వసిష్ఠమహర్షి ప్రార్థనపై స్వామి స్వయంభువుడై వెలసిన క్షేత్రమని స్థల పురాణం. సువిశాలమైన ప్రాంగణం-చూడముచ్చటైన నిర్మాణం-విష్ణు

లయాలలో సాధారణంగా కనిపించని నిత్యాభిషేకం-సుందరమైన తులసి, చేమంతి మాలలతో ముచ్చటైన అలంకారంలో మూల విరాట్టులు-కళలు చిందే కిరీటాలు-నృసింహుడు, లక్ష్మీదేవుల ఉత్సవ విగ్రహాలు-మొత్తం మీద ఆలయంలో ఏదో చిత్రమైన శక్తి ఉంది. ఉన్నంతసేపూ ప్రశాంతంగా అనిపించింది. అమ్మవారు రాజ్యలక్ష్మీదేవి, నాట్యమందిరం, పొడుగైన వరండాలు-మొత్తం ఒక ప్రాచీన దేవాలయానికి ఉండే సహజశక్తితో నిండి ఉంది. గతంలో చూచినప్పుడు హడావుడిగా చూచాము. ఇప్పుడు గుడి చాలా ఖాళీగా ప్రశాంతంగా ఉండటంతో యీ దర్శనం తృప్తిగా, ఆనందంగా అనిపించింది. అంతర్వేది దర్శనానంతరం దగ్గర్లో ఉన్న వసిష్ఠా శ్రమం చూడటానికి వెళ్లాము.

వసిష్ఠాశ్రమంలో శ్రీ చక్రం (మేరువు), అమ్మవారు ఉన్న దేవాలయం, దానికి పైన సప్తర్షుల దేవాలయం ఉన్నాయి. మంటపం పైన చిన్న గోపురంలా నిర్మాణం చేసిన ఒక శాలలో గోవులున్నాయి. మందిరం చుట్టూ నీళ్లు (వసిష్ఠ పాయలోనివేమో!) కాలువగా ప్రవహించే ఏర్పాటు చేసారు. గిరిజన బాలబాలికలకు ఆవాసగృహంగా-అనాథ శరణాలయంగా ఉపయోగపడేందుకు, ఇతర కార్యక్రమాలకు, భోజనాదికాలకు వీలుగా ఒక పెద్ద భవన నిర్మాణం చేసారు. హొంప్రొజెక్టర్ వంటి ఆధునిక సాధనాల సహకారంతో ఉన్నత విద్య నేర్చుకోదలచిన గిరిజన యువకులకు శిక్షణ యిచ్చే కార్యక్రమం ఒకటి నడుస్తున్నది. దీనినంతటినీ నిర్వహిస్తున్నవారు శ్రీ ప్రసాదరాజుగారు. ఆధ్యాత్మికత, ఆధునికత (వైజ్ఞానికంగా) కలిసి నడవాలని భావించే ప్రసాదరాజుగారు ఆ దిశగా అనేక కార్యక్రమాలు నడుపుతున్నారు. మరికొన్నిటివైపు నడుస్తున్నారు. వీరి కుమార్తె చి॥ దేవకీ కృష్ణసాయి చక్కని విద్య, సంస్కారం నేర్చుకొని తండ్రిగారికి కుడిభుజంగా పనిచేస్తున్నది. ఆశ్రమం అంతా తిరిగి చూచి, కొంతసేపు సంభాషించి, వారి ఆతిథ్యం స్వీకరించి బయటికి వచ్చేసరికి సాయంత్రం ఆరుగంటలు





దాటింది. అటు వెలుగూ, యిటు పూర్తి చీకటి కాని వేళలో కొంచెం క్రొత్తగా తోచే త్రోవలో ప్రయాణిస్తూ కృష్ణారావుగారింటికి వచ్చేసరికి ఏడుగంటలైంది.

అప్పటికే కొవ్వాడ నుండీ వచ్చిన మిత్రులు ఎదురు చూచి చూచి వెళ్లిపోయారు. వాకిటి నిండుగా కూర్చొని ఉన్నారు బాలసత్సంగం పిల్లలు. నాలుగేళ్లక్రితం ప్రారంభమై, ఒక ఏడాది నడిచి, తరువాత ఆగిపోయింది యీ బాలసత్సంగం. కానీ, ఆ పిల్లలంతా ఎంతో ప్రేమతో వచ్చి కూర్చున్నారు. “బాగున్నారాండీ! మళ్లీ రాలేదేమండీ!” అంటూ కుశలప్రశ్నలు- “శ్లోకాలు మాకింకా గుర్తున్నాయండీ అంటూ అప్పజెప్పటాలు - మొత్తం మీద వాళ్ల ప్రేమను తిరస్కరించలేక-ఎంత అలసిపోయి ఉన్నాగానీ, మరో గంటసేపు వాళ్లకు కథలు, పాటలు చెప్పి పంపక తప్పలేదు. పిల్లలు వెళ్లగానే గుడి కట్టబోయే స్థలంలో మైక్ ద్వారా హొరుమని భక్తి పాటల శబ్దం మొదలైంది. అది వింటూ వింటూ ఎప్పుడు నిద్రపోయామో తెలియదుగానీ తిరిగి మెలకువ వచ్చేసరికి ఆంజనేయ భజన ప్రారంభమైంది. ఒక్కొక్క ప్రాంతానికి, ఒక్కొక్క దేవు(డికి ఒక్కో రకం వాద్య సమ్మేళనం మేచ్ అవు తుందో ఏమో-ఆ భజనంతా హనుమంతుడికున్నంత ఫోర్స్‌తో సాగింది.

ఎనిమిదన్నరయ్యేటప్పటికి పిల్లలు, పెద్దలు ఒక్కరొక్కరుగా రాసాగారు. సాయినామం, సాయికథలు, మధ్య మధ్య అల్లర్లుగా పిల్లల గోల. పట్టుచీరెల తళతళలు, పూలకొమ్మల్లా నడిచివచ్చే కన్నెపిల్లలు, పదిరంతా కళకళ. అంతలో తొమ్మిదిన్నరైంది. పురోహితులు వచ్చారు - పూజ మొదలైంది. సంకల్పం చెప్తున్నారు-మధ్యలో “హిందూ ధర్మాచరణాభివృద్ధ్యర్థం” అని వినగానే ఆశ్చర్యానందాలు రెండూ కలిగాయి. అసలు పూజ అనేది కేవలం స్వలాభసిద్ధికే అయిపోతున్న యీ రోజుల్లో చక్కని సంకల్పం అనుకొన్నాము. పూజ సశాస్త్రీయంగా జరిగింది. శంకుస్థాపన కూడా నిర్విఘ్నంగా జరిగిపోయింది.

స్వామీజీ ప్రవచనం కోసం వేదిక ఏర్పాటైంది. స్థానిక ఎం.ఎల్.ఏ. పాముల రాజేశ్వరీదేవి కూడా దర్శనార్థమై వచ్చారు. శ్రీ కృష్ణారావుగారు తామీ దేవాలయ నిర్మాణానికి పూనుకోవటం అన్నది బాబా అనుగ్రహం, గురుదేవుల ఆశీస్సు తప్ప తమ ప్రతిభ కాదనీ, గ్రామీణులంతా యీ పని తమదేనని భావించి సహకరించటం తమకెంతో ఆనందమనీ అన్నారు. గురుదేవుల ఆశీస్సులుంటే త్వరలోనే యిది పూర్తి చేసి గ్రామానికి అంకితం చేస్తామన్నారు. ఇది సంస్కారకేంద్రంగా చెయ్యాలన్న ఆకాంక్ష వెలిబుచ్చారు. స్వాగతం పలికిన తరువాత వి.హెచ్.పి.లో స్టేట్ లెవెల్ వైస్-ప్రెసిడెంట్ శ్రీమతి గద్దే వరలక్ష్మిగారు దేవాలయాల ప్రాశస్త్యం గురించీ, భారతదేశ వైశిష్ట్యం గురించీ, కోట్లు ఆర్జించిన వాడికికూడా లేని గౌరవం కాషాయం కట్టిన వారికి ఉండటం యిక్కడి ప్రత్యేకత అనీ ఉపన్యసించారు. తదుపరి రాజేశ్వరీదేవిగారు సంక్షిప్తంగా, ఆర్ద్రంగా మాట్లాడారు. తాము టి.టి.డి.లో సభ్యురాలిగా ఉన్నప్పటికీ, అనేకానేకమంది స్వామీజీలు అక్కడి వచ్చి వెడుతున్నప్పటికీ కలగని భాగ్యం తమకీవేళ కలిగిందనీ, స్వామీజీ సరసన వేదికపై కూర్చోగల అర్హత తమకు లేదనీ - యిది కేవలం బాబా వారి అనుగ్రహమనీ చాలా ఆర్ద్రంగా చెప్పారు.

తరువాత పూజ్య గురుదేవులు తమ మంగళాశాసనంలో శ్రీ సాయి నాథుల వారి దేవాలయం రాకతో యీ పెదపట్నం నిజంగా ఆధ్యాత్మికతకు పెద్దపట్టణం కావాలనీ, యీ ఆలయం గొప్ప సంస్కార కేంద్రం కావాలనీ ఆశీర్వదించారు. మనిషి పుట్టినప్పుడు పసివాడనీ, పసి అంటే పశు ప్రాయుడని అర్థమనీ, కాలంతోపాటు ఎదిగి మనీషిగా మారతాడనీ, అలా ఎదగడానికి సంస్కారాలు అందించేదే దేవాలయమనీ వివరించారు. "పూజారులే వైద్యం చేసేవారు-వారే పురాణ ప్రవచనాలు చేసేవారు-వారే కొన్నిచోట్ల బడి కూడా నడిపేవారు. హరికథలు, పౌరాణిక నాటకాల ప్రదర్శన యిలాంటివాటి ద్వారా ఎన్నో విషయాలు తెలిసేవి. వీటన్నిటికీ





మూలం దేవాలయంగానే ఉండేది. సాయిబాబా దేవాలయం మరింత గొప్ప సంస్కారం యివ్వాలి. ఆ స్వామి ఆశుతోషుడు-స్మరణ మాత్రాన ప్రసన్నుడు" అంటూ సప్తశృంగి దేవత తమ పూజారినే బాబాను పూజించు కొమ్మని చెప్పిన వృత్తాంతం వివరించారు. లోకసేవ వలన సాయి సంతుష్టు లవుతారనీ, సేవ, త్యాగం, ప్రేమలతో కలిసి ఉండాలనీ, ప్రేమ వలన గొప్ప ఆత్మానందం కలుగుతుందనీ చెప్పారు. తదుపరి ఇలా దేవాలయం కట్టించి ధర్మాన్ని స్థాపించే ప్రయత్నం చేస్తూ పై జన్మకు పెట్టుబడిగా పుణ్యాన్ని ఆర్జిస్తున్న కృష్ణారావు దంపతులను ఆశీర్వదిస్తూ-ఒక సంవత్సరకాలంలోనే యీ ఆలయం పూర్తి కాగలదని మంగళాశాసనం చేసారు.

తరువాత గురుదేవులను, తదితరులను సముచిత రీతిన సత్కరించారు శేషారత్నంగారు, కృష్ణారావుగారున్నూ. గత మూడు రోజులుగా హోత్ హూత్ అని భయపెడుతూ, క్రితం రోజు బాగా కురిసిన వాన ఆనాడు ఏ మాత్రం యిబ్బందిపెట్టకపోగా ఫెళ్లున ఎండకాసి, కార్యక్రమం దిగ్విజయంగా జరగటం అన్నది బాబా వారి అనుగ్రహంగానే అంతా భావించారు. కార్యక్రమంలో అంతర్భాగంగా చక్కని వీనుల విందైన భజన, పాటలు కూడా ఏర్పాటయ్యాయి. దాదాపు రెండు వేల మంది భోజన ప్రసాదం స్వీకరించి సంతుష్టులైనారు. ఆ సాయంత్రమే బయలుదేరి తెల్లవారేటప్పటికి ఆశ్రమానికి చేరుకున్నాము. ఈసారి పెదపట్నంలో మాకు ఏర్పాట్లు చూచుకొన్న శ్రీమతి వెంకటలక్ష్మి (అమలాపురం)గారు, చి॥ మంజుల, ఆమె అక్కయ్య కూడా ప్రత్యేకంగా గురుదేవుల ఆశీస్సులకు పాత్రులైనారు.

నవంబరు 25వ తేదీ సాయిధామం బాలోత్సవం. పదిరోజుల ముందు నుండే కలకలం మొదలైంది. బట్టలు టెయిలర్లకివ్వడాలు (బట్ట ఖరీదు కన్నా కుట్టుకూలే ఎక్కువయ్యే రోజులు గనుక-యిదో సమస్య)-'కుట్టావా? కుట్టావా?' అని ఫోన్లు చెయ్యడాలతో మొదలైంది గోల. చైత్ర, సుధీరలు

క్లిప్పులు, గాజులు, రిబ్బన్లు వగైరా వగైరా సమకూర్చుకొనే పేచీలు...... దీపావళి నాడు మిగిల్చి దాచుకొన్న టపాకాయలు ఆ రోజులు ఎప్పుడు, ఎక్కడ కాల్చాలనే దాని మీద చర్చలు ... కాస్త ఖాళీ దొరికితే చాలు-యిదే గోల. చెప్పలు, కంపాస్ బాక్సులు, కలర్ బాక్సులు, కొత్త రైటింగ్ పాడ్స్ .... ఒకటా, రెండా ఒకటే గొడవ. మధ్యమధ్య పాటలు, నాటికలు, భజనలు నేర్చుకోవడాలు-అలాఅలా 25 వచ్చేసింది. క్రిందటిరోజే కడిగి ఉంచిన అన్నపూర్ణలో బల్లలు, కుర్చీలు, కార్పెట్లు వగైరాలు ఏర్పాటు చేసుకున్నారు. అలంకరించుకొన్నారు-ముందు హాలునూ, తరవాత తమనూ కూడా. ఆహూతుల కోసం ఆహ్వానం వ్రాసారు "రండహో రండి" అంటూ

రండహో రండి -
రండర్రా రండి -
రండి రండీ - రారండీ!
మము ప్రేమించే అమ్మమ్మలు
మము లాలించే తాతయ్యలు
మము నవ్వించే మామయ్యలు
ముద్దుగ చూచే అత్తయ్యలు
బుద్ధులు చెప్పే బాబాయిలు
చెంతకు చేర్చే చిన్నమ్మలు
అక్కున చేర్చే అక్కయ్యలు
ప్రేమలు కురిసే అన్నయ్యలు -
అంతా కలిసి - రండి ర్రారండి!
మేము కన్నులు తెరిచిన రోజిది
సాయి కరుణ కురిసిన మంచివేళ యిది
అందరు కలిసే రండి -
ఆశీస్సులు కురిపించండి!





ఇదె మీకు మా వందనమండీ!
మేమే బుడతలం - బుడుగులం -
మీకె వేచే నిసుగులం.

వృద్ధ మాతలను, తాతలను పిలిచి వచ్చారు. వాళ్ల టీచర్ల కోసం మరో ఆహ్వానం వ్రాసి అందించారు.

విద్యలు నేర్పే ఒజ్జలు మీరు
అజ్ఞత బాపే విజ్ఞులు మీరు
చీకటి కూల్చే వెలుగులు మీరు
సంస్కృతి పెంచే గురువులు మీరు
ప్రేమ విరిసే కల్పతరువులు మీరు
మము దీవింపగ రావాలండీ
తప్పక రండీ!

పదిగంటలయ్యేటప్పటికి గుడిలోకి వెళ్లి పూజ చేయించుకొని వచ్చారు.

ఆడపిల్లలకు ఇవ్వేళంతా శ్రమ లేకుండా చెయ్యాలన్న ప్రేమతో గొప్ప పారిశ్రామికవేత్త శ్రీ నాయర్ మామయ్యగారు, తంగమణి అత్తయ్య గారు గరిట చేత పట్టుకోవ టంతో అక్కయ్యలు, చెల్లెళ్లు కొంత రిలేక్సయ్యారు. వాళ్ల మిత్రులు కొందరు కూడా వచ్చి సాయం చేయటం వలన కూరగాయలు కొయ్యటం త్వరగా అయిపోయింది. సాయిధామం అభిమానులైనవారు అంతా వచ్చి అన్నపూర్ణలో సమావేశమైనారు. చల్లపల్లి (కృష్ణాజిల్లా), రేపల్లె (గుంటూరు జిల్లా) సిటిలోని వివిధ ప్రదేశాలు (చిక్కడపల్లినుంచీ కుక్కటపల్లి వరకూ). పరిసర గ్రామాల నుండీ వచ్చిన మిత్రులతోపాటు అనుకోకుండా వచ్చిన అతిథులను, పాత విద్యార్థులను ఆహ్వానించి కూర్చోబెట్టి భజనలతో కార్యక్రమం ప్రారంభించారు పిల్లలు. అంతలో పరమపూజ్య గురుదేవులు, మాతాజీ అన్నపూర్ణ హాలులోకి వచ్చారు. శ్రీ సాయినాథుల వారి ముందు దీపారాధన చేసి ప్రార్థన చేసారు.

స్వాగతోక్తుల తరువాత -

1910-'13లలో శ్రీ సాయినాథుల వారి దగ్గర దాదాపు నాలుగు నెలలున్న శ్రీ కృష్ణ కపర్దే వ్రాసుకున్న డైరీ (ఆంగ్లం)ని తెలుగులోకి మార్చి అచ్చువేసిన **"శ్రీ కపర్దే షిరిడీ డైరీ"** గ్రంథాన్ని పరమపూజ్య గురుదేవులు ఆవిష్కరించారు. తదుపరి వారు "క్షణక్షణం బాబాతో ఎంతో దగ్గరగా గడపగలిగిన మహానుభావులలో ఒకరి రచన యిది. గొప్ప ఎడ్వొకేటు, లోకమాన్య శ్రీ బాల గంగాధర్ తిలక్ అనుచరుడు, పరమభక్తుడు, పంచదశి మీద ఉపన్యాసాలివ్వగలంత ఆధ్యాత్మిక ప్రగతి సాధించినవాడూ అయిన కపర్దే వ్రాసిన యీ డైరీని తనకు బాబా యిచ్చిన ఆజ్ఞగా అనారోగ్యంతో ఉండి కూడా అనువదించినందుకు మాతా శుకవాణిని ఆశీర్వదిస్తున్నాను" అని ఒక వివేకానంద గ్రంథాన్ని అనుగ్రహించారు తదుపరి గురుజన సత్కారం గురించిన విశిష్టతను గురించి మాతాజీ సంక్షిప్తంగా చెప్పిన తరువాత పిల్లలు శ్రీ సాయి విద్యాధామంలోని ఉపధ్యాయ బృందం అందరినీ నూతన వస్త్రాలతో, తాంబూలాదులతో సత్కరించి నమస్కరించుకొన్నారు. అటుపైన వారికి (పిల్లలకు) కానుకలు అందించారు ఆశ్రమం వారు.

పిల్లలంతా తాము నేర్చుకొన్న వాటిని ప్రదర్శించేందుకు వీలుగా కుర్చీలూ అవీ జరుపుకొని ఖాళీ చేసుకున్నారు. మొదటగా "సువ్వీ, సువ్వీ, సువ్వాలమ్మా!" అన్న సంప్రదాయగీతం ఆలపించారు. తరువాత "పిల్ల పెట్టిన గంగాళం', 'పిసినారి కవలలు', "ఎవడురా రాజు!" అన్న చిన్ని చిన్న నాటికలు ప్రదర్శించారు. వాటిలో రాజకీయాలలో మునిగి స్వార్థపరులైన అధికార బధిరాంధుల మీద వ్యంగ్యంగా వ్రాసిన 'ఎవడురా రాజు!' అందరినీ చాలా అలరించి, హాయిగా నవ్వించింది. చివరగా ఆశ్రమబాలలు మంజులక్క, అమ్ములు, నందు, సుధ పాడగా అందరిచేతా భరతమాత స్తుతి చేయించిన "వందే భారతీ- శిర్‌పర్ హిమాలయ్ కా ఛత్ర్ హై-హోథోం మే వేదోంకే పత్రహై!" అన్న పాట కూడా అందరికీ నచ్చింది. అందరూ హాయిగా





"వందేమాతరం-జై భారతీ, వందే భారతీ" అని గొంతులు విప్పి కోరస్ పాడేసారు కూడా. "నేనూ పాడుతా మాతాజీ!" అంటూ మా పద్మజమ్మ కూతురు చి॥ చిన్మయి (భువనగిరి) ముందుకువచ్చి తాను కూడా ఒక దేశభక్తి గీతం ఆలపించింది. చి॥ రాజేశ్వరి తాను ఆశ్రమంలో ఎలా పెరిగిందీ, ఏమి నేర్చుకొన్నదీ చక్కని భాషలో అందంగా చెప్పి పెద్దల అభినందనలు అందుకొన్నది.

ఇక చివరి అంశం భోజనాలు. తిన్నవారంతా "చాలా రుచిగా ఉన్నాయి వంటకాలన్నీ" అనేలాగా ఏర్పాట్లు చేసారు నాయరుగారి సాయంతో యువకార్యకర్తలు. అందరూ సాయిప్రసాదం తీసుకొని సాగిపోయారు. ఉదయం రాలేనివారు కొందరు సాయంత్రం పిల్లలను ఆశీర్వదించి వెళ్లటం ఆనందప్రదం. సరే మరునాడు 26న కాస్త విశ్రాంతి. నవంబరు 27వ తేదీ ఉదయం పర్యటనకు బయలుదేరిన స్వామీజీ బృందం సత్తెనపల్లిలో ఆగి కోదండరామునికి నమస్కరించి, అక్కడి స్థితిగతులు చూచుకొని, సాయంత్రం ఎనిమిది గంటలకు రేపల్లె దగ్గరి క్షేత్రానికి చేరుకున్నది. ఆ రాత్రి విశ్రాంతి. మరునాటి ఉదయం భాస్కరప్రసాద్, శ్రీలక్ష్మి, సుధగారు, ఆమె భర్త, శారదమ్మగారు వగైరా భక్తులు రావటం, శారదమ్మగారి చెల్లెలు, వారి బంధువులు రావటం - వారందరితో సత్సంగం, కౌన్సెలింగ్‌లతో మధ్యాహ్నమైంది. సాయంత్రం మూడున్నరకు బయలుదేరి నల్లూరు గ్రామంలో రాజా అనే గృహస్థు యింట్లో సత్సంగ సమావేశానికి వెళ్లారు. పూజ, సత్సంగం పూర్తి అయ్యేసరికి ఆరుగంటలైంది. కార్తీక దీపాలు పెట్టే వేళ కావటంతో కొంచెం తొందరగానే ముగించవలసి వచ్చింది. స్వచ్ఛమైన హృదయాలతో ఆ గ్రామీణ స్త్రీలు (ఇద్దరు ముగ్గురికన్నా పురుషులు లేరు.) శ్రద్ధగా స్వామీజీ చెప్పిన మాటలు విన్నారు. అక్కడినుండీ ఆశ్రమానికి వస్తూ వస్తూ త్రోవలోని మూర్తోట ముక్తీశ్వరస్వామి ఆలయానికి వెళ్లాము. ముక్తీశ్వరుడు పెద్ద విభూతిరేఖలతో, నడుమ కోలగా దిద్దిన కుంకుమతో ఎంతో సజీవంగా కళకళలాడుతున్నాడు. ఇక అమ్మగారు

పార్వతీ దేవి లలితలావణ్యరాశిగా ముద్దులు మూటగడుతున్నది. కనకదుర్గా దేవిని తలపించింది. పూజారులు మాత్రం బాగా అలసిపోయారో, అలసత్వమో గానీ, ఏమీ పట్టనట్లున్నారు. స్వామి దర్శనానంతరం ఆశ్రమానికి చేరు కున్నాము. అప్పటికే సాయి దేవాలయం సర్వతోభద్రలో స్వామి ముందర దీపపంక్తులు కొలువుదీరాయి. పద్మాకృతుల వంటి డిజైన్లలో కూడా దీపాలు అమర్చారు. ఊరిలో శ్రద్ధాళువులైన కొంతమంది పిల్లలు, స్త్రీలు వచ్చి పూజ చేసుకొని దీపోత్సవంలో పాల్గొన్నారు. శేఖర్, సత్యనారాయణ గారిలాంటి భక్తులతో కాసేపు సంభాషణ నడిచింది.

29వ తేదీ ఉదయం ఆరుంబావుకే బయలుదేరి ఎనిమిదయ్యేటప్పటికి తెనాలి చేరుకున్నాము. ప్రముఖ సాయిభక్తులు శ్రీ సాయివరప్రసాదరావు గారి యింట్లో ఉపాహారాలు తీసుకొని, తొమ్మిది గంటలకంతా కన్యకాపర మేశ్వరీ ఆలయం దగ్గరికి చేరుకున్నాము. విశాలమైన ప్రాంగణంలో షామి యానాల క్రింద బారులు తీరుతున్నారు భక్తులు అప్పటికే. కొందరు వాలం టీర్లు పసుపు, కుంకుమలు, తమలపాకులు, పళ్లు, కొబ్బరికాయలు వగైరాలు అందిస్తున్నారు పూర్తి ఉచితంగా ఏర్పాటైన శ్రీ సాయి సామూహిక వ్రతాలకు మూలస్తంభంలా నిలబడిన చి॥ గోపీకృష్ణ హడావుడిగా యిటూ అటూ తిరుగుతున్నాడు. గురుదేవులకు పూర్ణకుంభ స్వాగతమిచ్చి తీసుకువెళ్లి వేదికపైన ఆసీనులను చేసాడు. మెల్లమెల్లగా షామియానాలన్నీ నిండిపోయాయి. సుమారు 300 జ్యోతులు వెలిగాయి. సభ ఓంకారంతో ఆరంభించి, గురుదేవుల గురించి, సాయివ్రత శక్తిని గూర్చీ, ఆశ్రమం గురించీ పరిచయం చేసారు మాతాజీ. తదుపరి వ్రతం ప్రారంభమైంది. రాంబాబు ప్రధాన పూజలో కూర్చున్న గోపీకృష్ణ తల్లిదండ్రులకు, తదితర దంపతులకు ఏమేమి ఎప్పడు చెయ్యాలో వివరంగా చెప్తూ పూజ చేయిం చాడు. హఠాత్తుగా మైక్ కాస్తా పాడైంది. దాని సంచాలకుడు అటూయిటూ పరుగులు పెట్టటమే తప్ప అది నడవటం లేదు. పందిరేమో పొడవుగా ఉ ంది. ఈ చివర చెప్పింది ఆ చివరికి వినపడటం లేదు. దానితో మాతాజీ వెళ్లి మధ్యలో నిలబడి వెనుక వారికి చెప్తోంటే రాంబాబు పీఠం దగ్గర





కూర్చొని ముందరివారికి చెప్తూ పూజ చేయించవలసి వచ్చింది. చివరికెలాగో ఆ మైకు మహాలక్ష్మి కనికరించ టంతో కథలు చెప్పటానికి మాత్రం యిబ్బంది కలగలేదు. ఐదు కథలూ సవివరంగా వినిపించాక మహానివేదన, హారతి జరిగాయి. అంతసేపూ భక్తులంతా కూడా చాలా శ్రద్ధగా కూర్చొని వినటమేకాక, చోల్కరు కథ వింటూ, మైనతాయి కథ వింటూ కొందరు కన్నీరు పెట్టుకున్నారు కూడా.

ఈ కార్యక్రమానికి పొన్నూరు నుంచీ శ్రీ ఆలూరు గోపాలరావుగారు (మూడు దశాబ్దాలుగా అవిచ్ఛిన్న సాయిసేవతో పునీతులైన-అవుతున్నవారు) ఎనిమిదన్నర దశాబ్దాల వయస్సులో శ్రీ లక్కరాజుగారు (సాయి సేవలో ఆరి యుందేరిన భీష్ములు వీరు- సహస్ర మాస జీవులు) సత్సంగ నిర్వ హణతో పునీతులవుతున్న సుభాష్‌గారు చిరకాలంగా సాయిప్రచారంలో ఉన్న శ్రీ సాయివరప్రసాదరావుగారు, ప్రధవ జయరావుగారు యింకా ఎందరో మంచి మంచి భక్తులు రావటం చాలా ఆనందం కలిగించింది. వారంతా గురువుగారి వాక్కుల కోసమే వేచి ఉన్నారు. మహాహారతి కాగానే గురుదేవులు తమ మంగళ ప్రవచనం దయచేసారు-వారి మంద్రగంభీర మైన స్వరంతో. శ్రీ సాయి పూజ చేయాలన్న తలంపు కలగటమే పాప వినాశనానికి మూలమనీ, సాయి సర్వరక్షకులనీ, వారిది సంస్కార కార్యమనీ సెలవిచ్చారు. సామూహిక పూజ వలన విశిష్ట ఫలితాలను గూర్చి వివరించిన స్వామీజీ క్రమంగా జాతి సంస్కారహీనమవుతున్నందుకు తమ ఆవేదనను వెలిబుచ్చారు. కట్టు, బొట్టు, భాష, నడక, నడత-ప్రతిదానిలోనూ వచ్చిన వక్రరీతులను గూర్చి ప్రస్తావించారు. హిందువు జీవించవలసిన తీరుతెన్నులేమిటో వివరిస్తూ ప్రేమ ఉన్నచోటనే దైవం ఉంటారనీ, సాయి బాబా ప్రేమ మూర్తీభవించిన రూపమనీ, అలాంటి ప్రేమభావననే అందరూ అలవరచుకోవాలనీ ఆశీర్వదించారు. తరువాత యీ కార్య భారాన్ని తమ భుజాల మీద వేసుకొని చక్కగా నిర్వహించిన చి॥ బూర్లగడ్డ గోపీకృష్ణ, సాయిమాధురి దంపతులను ఆశీర్వదించి, చీకటిలో కూడా వెలుగులు చిమ్మగల సాయిబాబా చిత్రపటాన్ని బహూకరించారు. భక్తులందరికీ

ఊదీప్రసాదం యిచ్చారు స్వామీజీ. పూజలో పాల్గొన్నవారూ, చూడవచ్చిన భక్తులూ, చివరికి ఏదో పని మీద దారినపోతూ "భోజనాలు పెడుతున్నా రటగా!" అంటూ వచ్చిన వారు-ఎవ్వరికీ లోటు లేకుండా సాయి అన్న ప్రసాదం పెట్టి పంపారు నిర్వాహకులు. గురుదేవులను, తదితర ఆశ్రమ వాసులనూ కూడా సముచితరీతిన సత్కరించుకున్నారు గోపీకృష్ణ దంపతులు, మేనమామగారు, మామగారు వగైరాలు. అంతలో ఒక తల్లి వచ్చి సప్తసప్తాహాల పారాయణ చేసుకుంటున్నాననీ, ఒక్క గడియ తమ యింట అడుగు పెట్టమనీ పదేపదే కోరటంతో స్వామీజీ వారి యింటికి వెళ్లి హారతిచ్చి, ఆశీర్వదించి వచ్చేసరికే మూడు కావస్తోంది. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీసాయి వరప్రసాదరావుగారింట్లో చిన్న భక్త సమ్మేళనం లాంటిది జరిగింది. గరికపాడు, తాడిపర్తి, పచ్చల తాడిపర్రు, పొన్నూరు, రేపల్లె వగైరా ఊళ్ల భక్తులు సమావేశంలో ఉన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాయీ సేవక సంఘం (సమాఖ్య) గుంటూరు జిల్లాకు కార్యదర్శి శ్రీ ఆలూరు గోపాలరావుగారు సాయితత్త్వ ప్రచారకులను తయారుచేసే పనిలో భాగంగా కొందరు గృహిణులకు సాయి సచ్చరిత్రపై అవగాహన కలిగించేందుకై తీవ్రకృషి చేసారు. అక్కడ చక్కగా శిక్షణ పొందిన యీ గృహిణులు తమ పరిసర గ్రామాలలో చిన్నచిన్న సత్సంగ సమావేశాలు ఏర్పాటు చేసుకొని వాటిలో ఒక్కొక్క విషయం గురించి వారిదైన పద్ధతిలో విశదీకరిస్తున్నారు. వారిలో కొందరు తమ ప్రసంగాలు స్వామీజీకి వినిపించాలన్న భావనతో యిక్కడికి వచ్చారు. శ్రీమతి వాణిశ్రీ తాళ్లూరి (పచ్చల తాడిపర్రు) హేమాడ్పంత్ కథ, దానిలో లోతులు చెప్పగా -శ్రీమతి కె. సుభాషిణీదేవి (గరికపాడు) మేఘశ్యాం కథను వివరించారు. శ్రీమతి కొమ్మినేని పద్మ (తాడిపర్తి) మానవ జన్మ సాఫల్యం గురించి వివరించారు. వాటిని మరింత లోతుకు వెళ్లి అధ్యయనం చేయవలసిన అగత్యం గురించి చర్చించబడింది. సమయాభావం వలన మిగిలిన వారి ఉపన్యాసాలు వినలేకపోయాము. తరువాత స్వామీజీ వారిని ఆశీర్వదిస్తూ పండితులు వాగ్వైఖరి, శబ్దఝురి (మాటల ప్రవాహాలు) చూపించి చెప్తారనీ, ఆ మాటల





వెనుక అనుభూతి ఉండదనీ, వీరి మాటలలో అనుభూతి కన్పిస్తున్నదనీ అన్నారు. బాబా చరిత్ర యితరులకు చెప్తున్నపుడు, వారి బోధలు వివరిస్తున్నపుడు 'నేను ఇలాగే ఉన్నానా?' అనే ప్రశ్న లోలోపల మెదలుతుందనీ, అది అంతరంగాన్ని కదిపి మథిస్తుందనీ, దాని వలన అనుభూతి గాఢమవుతుందనీ అన్నారు. మొత్తం ఫ్రీగా, ఏ మాత్రం తడుము కోకుండా, కంఠస్థం చేసినట్లు కాకుండా చెప్తుంటే వినే వారి హృదయాలకు బాగా హత్తుకొంటుందన్నారు. వీరినిలా తయారుచేయటం వెనుక శ్రీ ఆలూరి గోపాలరావుగారి కృషినీ, నిజాయితీనీ మనసారా అభినందిస్తున్నా మని అంటూ అందరినీ ఆశీర్వదించారు స్వామీజీ.

చల్లని తల్లి వరప్రసాదరావుగారి యిల్లాలు అందించిన ఉపాహారాలు చేసి అయిదుంబావుకు వారి అభిమానాన్ని మూటకట్టుకొని తిరుగు ప్రయాణం ప్రారంభించాము. తెనాలి కాలేజి వంతెనకు దగ్గరలో నిర్మాణమైన శ్రీ రామదాస్‌జీ ధ్యానమందిరం దగ్గర నిర్వాహకుల కోరిక మేరకు కొద్దిసేపు ఆగారు స్వామీజీ. రాజయోగి శ్రీరామదాస్‌జీ దాదాపు ఏభై ఏళ్లపాటు అదేచోట నివసించారనీ, ఎందరో శిష్యులకు మంత్రోపదేశాలిచ్చారనీ, ధ్యానాదికాలు చేయించేవారనీ అక్కడి శిష్యులు చెప్పారు. వారు కైవల్యం చెంది పన్నెండేళ్లు దాటింది. ధ్యానమందిరం చక్కగా, పరిశుభ్రంగా, ప్రశాంతంగా ఉంది. నిజంగా ధ్యానానికి అనుకూలంగానే ఉన్నది. వారిచ్చిన ఫలాలు తీసుకొని, తిరిగి కారెక్కాము. ఈసారి ప్రయాణం విజయవాడ మీదుగా అన్నాడు రాంబాబు. దానివలన చాలా సమయం కలిసి వచ్చింది. రాత్రి పదకొండున్నరకల్లా ఆశ్రమానికి చేరుకొని "హమ్మయ్య!" అనుకొని కాళ్లు రుద్దుకోసాగాము. కారు శబ్దం విని నిద్ర లేచి వచ్చిన ఏడేళ్ల చైత్రలక్ష్మి క్రిందటి రోజు వచ్చిన నక్కలను గూర్చీ, సుధీరకు చెయ్యి కాలటం (కొద్దిగా) గురించీ, తమ టీచరు స్కూలుకు ఆ రోజు రాకపోవటం గురించీ పూర్తి రిపోర్టు ఇచ్చిన తరువాతగానీ మమ్మల్ని "సరే, పడుకోండి" అనలేదు. మరోసారి 'అమ్మయ్య' అనుకొని నిద్రకు ఉపక్రమించాము.

# అలనాటి వీరయువకుల త్యాగగాథ

ఢిల్లీలో 1906 ప్రాంతాలలో విప్లవోద్యమం ప్రారంభించారు లాలాహర్ దయాల్, లాలా హనుమంత సహాయి, మాస్టర్ అమీర్‌చంద్ అనే దేశభక్తులు. వీరిలో అమీర్‌చంద్ ఉపాధ్యాయుడు, తీవ్రవాది. హనుమంత సహాయ్ వ్యాపారి, శ్రీమంతుడు, సంఘ సంస్కర్త. వీరిద్దరూ కలిసి ఢిల్లీలో స్వదేశీ ఉద్యమం ప్రారంభించారు. 1908లో హరదయాల్ వీరితో కలిసాడు. ఆయన పరమ తీవ్రవాది. విదేశాలలో రాజకీయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని భారతదేశానికి తిరిగి వస్తూనే తీవ్ర కృషి ప్రారంభించాడు. త్వరలోనే యితనిపై బ్రిటిష్ వారి వక్రదృష్టి పడింది. అందుచేత హరదయాల్ తిరిగి విదేశాలకు వెళ్లిపోయాడు.

హనుమంత సహాయ్ ప్రభుత్వ నిరంకుశనీతిని సహించలేక తన యింట్లోనే (చేలాపురంలో) ఒక జాతీయ కళాశాల నెలకొల్పి విద్యార్థులలో జాతీయభావాలు రేకెత్తించసాగాడు. అమీర్‌చంద్, గణేశ్‌లాల్ మొదలైన దేశభక్తులు అందులో ఉపాధ్యాయులుగా చేరి తీవ్రవాద వ్యాప్తికి తోడ్పడసాగారు. అవధ బిహారీ అనే యువకుడు అమీర్‌చంద్ యింట్లోనే ఉండి బి.ఏ. చదివాడు. గొప్ప ఉత్సాహం, సాహసం ఆయన సొత్తులు. అతడు, బలరాజ్, బాలముకుంద్‌లు కూడా యీ విప్లవసంఘంలో చేరి ప్రచారం మొదలుపెట్టారు. దీనానాధ్, ఖుశీరాం మన్నూలాల్ మొదలైన ఎందరో సభ్యులుగా చేరారు. 'లిబర్టీ' అనే కరపత్రాలు విరివిగా పంచిపెట్టారు.

ఇలా ఉండగా 5వ జార్జి ఇంగ్లండుకు రాజై 1912 చివరిలో ఢిల్లీలో గొప్ప దర్బారు చేసాడు. ఢిల్లీ రాజధానిగా ఎంచుకొని ప్రభుత్వ ఆఫీసులన్నీ అక్కడికి మార్చారు. ఆ ఉత్సవంలో హార్డింజ్ అనే వైస్రాయి ఘనంగా ఊరేగుతూ వస్తుండగా చాందినీ చౌక్ దగ్గర అతనిపైకి ఎవరో బాంబు





విసిరారు. అది గురి తప్పి ఒక అంగరక్షకుడు మరణించాడు. హార్డింజ్‌కు కూడా తల వెనుక భాగంలో చిన్నదెబ్బ తగిలింది. తదుపరి 1913 మే నెలలో లాహెూర్‌లో సివిల్ అధికారులందరూ సమావేశమైన హాలులో వారినందరినీ ఒకే దెబ్బకు చంపే ప్రయత్నంతో ఒక బాంబు పెట్టబడింది. ఒక్క బంట్రోతు మాత్రమే మరణించాడు దాని వలన. ఈ రెండు సంఘటనలకూ కారకులైన వారిని పట్టుకోవడానికి ఆంగ్లేయులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దానితో ఎక్కడెక్కడి విప్లవ కేంద్రాల మీదా, నగరాల మీదా సోదాలు ప్రారంభించింది ప్రభుత్వం. అందులో కలకత్తా ఒకటి.

సోదాలలో అవధ్ బిహారీ పేరు బయటపడింది ముందుగా. అతను అమీర్‌చంద్ యింట్లోనే ఉంటూండటం వలన అధికారులు ఆయన యిల్లు సోదా చేసారు. బాంబుపైకప్పలకు ఉపయోగపడే డొల్ల ఒకటి, కరపత్రాలు, పార్టీ ప్రణాళిక, ఇంకొన్ని ఉత్తరాలు దొరికాయి. అవధ బిహారీ, అమీర్‌చందు, సుల్తాన్ చందులను అరెస్టు చేసారు. ఒక లేఖలోని సంతకం దీనానాధ్‌దని గ్రహించి ఎంతోమంది దీనానాధ్ అనే పేరున్న వారిని బంధించి చివరికి అసలు దీనానాధ్‌ను బంధించారు. అతను భయపడిపోయాడు. వాడికి అవధ్ బిహారీతో కూడా పరిచయం ఉంది. హరదయాల్ విదేశాలకు వెడుతూ విప్లవ కార్యక్రమాలు అమీర్‌చంద్‌కు అప్పగించి వెళ్లాడన్న రహస్యంతో సహా అనేకమంది విప్లవవీరుల పేర్లు బయటపెట్టేసాడు. ఈ విషయం తెలిసి రాసబిహారీ బోసు పరారైనాడు.

అమీర్‌చంద్, అతని అన్న కుమారుడు సుల్తాన్‌చంద్‌లతోసహా మొత్తం పదముగ్గురిని అరెస్టు చేసింది ప్రభుత్వం. సుల్తాన్‌చంద్ మీద విప్లవ సహకారి అన్న నేరం ఋజువు కాలేదు. కానీ, పోలీసులు అతన్ని బెదిరించి, ఆశ పెట్టి, లిబర్టీ కరపత్రం అమీర్‌చంద్ స్వదస్తూరితో వ్రాసాడనీ, ఆయన యిల్లే విప్లవ కార్యాలకు స్థావరమనీ సాక్ష్యమిప్పించాడు. తాను ప్రాణప్రదంగా

కన్నకొడుకులా ప్రేమించి పెంచుకున్న అన్న కుమారుడే తన ప్రాణం తీసే సాక్ష్యమిచ్చినందుకు అమీర్‌చంద్ నిర్ఘాంతపోయాడు. "ఓ ఆంగ్ల గూఢ చారుల్లారా, మీ తెలివితేటలు అసమానాలు. మీ వలలో చిక్కనిది ఏదీ లేదు" అని గర్జించి, సంకెళ్లతో తలపై కొట్టుకొన్నాడు.

సుల్తాన్‌చంద్, దీనానాధ్‌లను విడిచిపెట్టారు. 1914 అక్టోబర్ 5 వరకు కేసు సాగింది. పైన చెప్పకొన్న కేసులలో బాంబులు విసిరింది వీరేనని ఋజువులు లేకపోయినాగానీ శిక్షలు మాత్రం తప్పలేదు. జడ్జిమెంటు ముందు వ్రాసుకొని ఆర్గ్యుమెంటు వినే జాతికి సిగ్గు, ఎగ్గు ఏముంటుంది గనుక! అవధ్ బిహారీ, అమీర్‌చంద్, బాలముకుంద్‌లకు ఉరిశిక్ష విధించారు. ముందు ఆజీవశిక్ష వేసి తరువాత వసంతకుమార్‌కు కూడా ఉరిశిక్షే ఖాయ పరిచారు. బలరాజు, హనుమంత సహాయ్‌లకు ద్వీపాంతరవాస శిక్ష పడిందిగానీ తరువాత 7 సంవత్సరాలకు తగ్గించారు. మిగిలిన వారిని విడిచిపెట్టేసారు.

ఉరిశిక్ష పడిన అమీర్‌చంద్, బాలముకుంద్, అవధ్ బిహారీలు జైల్లో ఏ మాత్రం విచారం లేకుండా సంతోషంగా కాలం గడుపుతూ జైలు వార్డర్లు మొదలైన వారికి కూడా విప్లవభావాలు బోధించేవారని అక్కడి వృద్ధ వార్డర్లు చెప్తూ ఉండేవారు. వసంతకుమార విశ్వాస్ 21 సం॥ వయస్సులో ఉరికంబం ఎక్కాడు. తరువాత కొద్దికాలానికి అమీర్‌చంద్ జీవితం పరిసమాప్తి చేసారు.

అవధ్ బిహారీని ఉరితీయబోతూ 'నీ తుది కోరిక ఏమిటి?' అని ప్రశ్నించాడు జైలు అధికారి. "ఆంగ్ల రాజ్యం అంతరించు గాక!" అన్నాడు అవధ్ బిహారీ. "ఇంకా మాటలెందుకు? ప్రశాంతంగా మరణించు" అన్న ఆంగ్లేయాధికారి వైపు చూచి నవ్వాడతను. "అప్పడే శాంతి ఎక్కడిది! నాలుగు వైపులా భయంకరమైన విప్లవాగ్ని రగిలి, అందులో నీవు-మీ ఆంగ్ల ప్రభుత్వం, నేను-మా బానిసత్వం అన్నీ భస్మీభూతమై, నా మాతృభూమి స్వతంత్రమైనప్పడు-అప్పడు గదా మాకు శాంతి! అదే నా కోరిక" అన్నాడు. అలా అంటూనే చిరునవ్వుతో ఉరిత్రాటిని కౌగిలించుకున్నాడు అవధ్





బిహారీ. మాతృచరణాలకు అంకితమైపోయాడు. బాలముకుంద్‌కు బాల్యం లోనే వివాహమైంది. భార్యాభర్తలొక్క గడియైనా కాపురం చేసి ఎరగరు. బాలముకుందుడు ఉరి కోసం ఎదురుచూస్తూ జైలులో ఉన్నన్ని రోజులూ అతని భార్య కూడా అతనెలాంటి (జైలు) తిండి తింటున్నాడో తాను కూడా అలాగే తింటూఅతనిలాగే తాను కూడా కటికనేల మీద పడుకొంటూ గడిపింది. నవయవ్వనంలోకి అప్పడే అడుగుపెట్టిన ఆ సాధ్వి బాల ముకుందుని ఉరితీసిననాడే ప్రాణం విడిచింది. మిత్రులారా, ఇటువంటి లేలేత మొగ్గలు, మహా యిల్లాళ్ళు, విజ్ఞానధనులు, త్యాగమూర్తులు ఎందరెందరో బలి అయితే గానీ మన దేశం పరాయి పాలన నుండీ విముక్తం కాలేదు. మళ్లీ ఓసారి వ్యాపారం పేరుతో, మతం పేరుతో, ఫ్యాషన్ల పేరుతో చొచ్చుకు వచ్చే విజా తీయులకు తలలొగ్గి మరోసారి బానిసలమవుదామా - జూలు విదిలించిన సింగపుకొదమలమై గర్జిద్దామా-ఆలోచించండి.

## విద్య

**(32వ పేజీ తరువాయి)**

ఒక్క రోజు కూడా ఎవ్వరూ బ్రతకకూడదు" అని విస్పష్టంగా చెప్పేవారు ఆయన. "ఎవడేమైతే నీకేం? నువ్వు మాత్రం బాగుపడు" అని బోధించే సంస్కృతి పెరిగిపోయిన ఈ కాలప్రవాహంలో కొట్టుకుపోయే తల్లిదండ్రులు యీ మాటలు గుర్తు పెట్టుకోవాలి.

సుహోమ్లిన్‌స్కీ "పిల్లలకే నా హృదయం అంకితం"అనే చక్కని పుస్తకం వ్రాశారు. అది చదువుతున్నపుడు ఆయన నడిపిన సంతోషచంద్రశాల బోధన తీరుతెన్నులు మన కళ్ల ముందు స్పష్టంగా ప్రత్యక్షమవుతాయి. ప్రియ ఉపాధ్యాయులారా, యీ పుస్తకం సంపాదించి చదవండి. ప్రకృతిని ఆస్వాదిస్తూ, తెలుసుకుంటూ, చిత్రిస్తూ, ఊహిస్తూ, ప్రశ్నిస్తూ ఆ పాఠశాలలో పిల్లలు విద్య నేర్చుకున్న సంగతులు చదువుతుంటే మనం కూడా పిల్లల మయిపోయి ఆ బడిలో చేరిపోయి చదవాలనుకుంటాం, నిజం.

బాలవాణి

# కీలెరిగివాత ...

- మాతాజీ

అనగనగా ఒక నవాబు గారుండేవారు. ఆయనకు తన పొరుగున ఉన్న ఒక హిందూ ప్రభువు యశోధనుని కీర్తి ప్రతిష్ఠలను చూస్తే చాలా కోపం వచ్చేది. ఆ ప్రభువు దగ్గర అనేకమంది కవులుండేవారు. వారు తమ తమ కావ్యాలు రాజుగారికి అంకితమిచ్చి ధన రత్న మాణిక్యాలు, అగ్రహారాలు, మరెన్నో బహుమతులు పొందేవారు. వారు తమ కావ్యాలలో యశోధనుడి కీర్తిని గూర్చి, దానబుద్ధిని గూర్చి చాలా గొప్పగా వ్రాసేవారు. దానితో ఆయన కీర్తి దూర తీరాలకు పాకిపోయింది. చారుల ద్వారా అలాంటి కబుర్లు వింటూ ఉన్న కొద్దీ నవాబు గారికి ఒళ్లు మండిపోయేది. ఈ మధ్య ఒక కవి యశోధనుడినీ, ఆయన తమ్ముళ్లనీ శ్రీరాముడు, ఆయన సోదరులుగా వర్ణించి, ఆయన శత్రువులను రావణాదులుగా చిత్రించి ఒక అభినవ (క్రొత్త) రామాయణం వ్రాసాడుట! దాన్ని చదివిన వారంతా చాలా చాలా బాగుందన్నారట! ఇది వినగానే నవాబు గారికి ఓ అద్భుతమైన ఆలోచన వచ్చింది.

దేశంలోకెల్లా గొప్ప కవులను పిలిపించాడు. "మీ దేశంలో గొప్ప గ్రంథాలేవి?" అని అడిగాడు. వాళ్లు "రామాయణం, భారతం, భాగవతం" అని చెప్పారు. రామాయణం యశోధనుడి పేరిట వ్రాసారు గదా! అందుచేత తన కథతో భారతం వ్రాయించాలనుకొన్నారు నవాబుగారు. అయితే భారతం చాలా పెద్ద గ్రంథం అంటున్నారు కవులు. ఏ ఒక్కరో వ్రాయాలంటే తాను బ్రతికి ఉండగా అది పూర్తి కాకపోవచ్చు. అందుచేత నలుగురు కవులకు తాంబూలాలిచ్చి తన చరిత్రతో మహాభారతం వ్రాయమని ఆజ్ఞాపించాడు నవాబు.

కవులు నవాబు కత్తికి భయపడి తలలూపారేగానీ వాళ్లకీ ఆజ్ఞ బొత్తిగా నచ్చలేదు. మహాభారతం అంటే మామూలు కథ కాదు - కృష్ణ కథ. దానిని యామ్లేచ్ఛుడి పేరిట మార్చి ఎలా వ్రాస్తారు? హిందువులకు పరమపవిత్రమైన భగవద్గీతకు మూలమైన భారతం తాము మార్చి వ్రాయడం ఎలా? చాలా రోజులు గడిచాయిగానీ వీళ్లకు ఉపాయం తోచలేదు. చివరికి వాళ్లు భారతం ముందు





వేసుకొని కూర్చున్నారు - ఎలా చెయ్యటం అని. అది చదువుతూ ఉంటే ఒక కవికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. తన మిత్రులతో ఆ ఆలోచన చెప్పాడు. మరునాడు అందరూ కలిసి రాజాస్థానానికి బయలుదేరారు.

"ఏమి కవీంద్రులారా, ఎంతవరకు వచ్చింది మా పేరిట మహాభారత రచన?" అని అడిగాడు నవాబు. "చిత్తం జహాఁపనా! ప్రారంభించాము. అసలీపాటికి సగం పైగా అయిపోయేదే చిన్న సందేహం రావటంతో ఎటూ తోచక తమ దగ్గరికి వచ్చాము" అన్నాడు పెద్ద కవి. 'ఏమది?' అని ప్రశ్నించాడు నవాబు.

"తమను పాండవపక్షంగానూ, తమ శత్రువులను కౌరవపక్షంగాను చిత్రించాము జహాఁపనా! తమ గురువుగారిని శ్రీకృష్ణునిగాను, మీ పెదతండ్రిగారు, తాతగారు, మేనమామగారు మొదలైన వారిని భీష్మ, ద్రోణ, విదురాది బంధుమిత్రులుగాను చిత్రించాము. తమను ధర్మరాజుగా రూపొందించాము. ఇదంతా బాగానే సాగింది గానీ .......... తటపటాయిస్తున్నాడు పెద్దకవి.

"ఊఁ! చెప్పండి" నవాబు ఆసక్తిగా అన్నాడు.

"తమరు కోపించకూడదు జహాఁపనా! ఇది కొంచెం సున్నితమైన విషయం" చిన్న కవి నసుగుతూ అన్నాడు.

"ఫర్వాలేదు - చెప్పండి"

"మరి మహాభారతంలో పాండవులు అయిదుగురు మీరేమో ఒక్కరే. ద్రౌపదీ దేవి అన్నదమ్ములు అయిదుగురికీ భార్య అయినట్లు వ్రాసి ఉంది భారతంలో. మరి, యిప్పుడు బేగం సాహెబా వారు తమరు గాక మరో నలుగురికి............ అంటే ఆ నలుగురూ ఎవరని వ్రాయమంటారో సెలవిస్తే ..... " పెద్దకవి ఆపేసాడు.

నవాబుగారి కళ్లు ఎర్రబడ్డాయి.

"ఊఁ!" ఒక్క గర్జన చేసాడు.

"ఛీ!ఛీ! అలాటి పుస్తకం నా పేరిట వద్దు. దాన్ని చించి అవతల పారెయ్యండి-ఫొండి" అన్నారు కొరకొరలాడుతూ.

"చిత్తం జహాఁపనా!" వంగి వంగి సలాములు చేస్తూ 'బ్రతుకుజీవుడా!' అని బయటబడ్డారు కవులంతా.

# విద్య

సుహోమ్లీన్ స్కీ సోవియట్ రష్యాలో ఒక పాఠశాలలో దాదాపు ముప్పై సంవత్సరాలు పనిచేశాడు. అంతకుముందు తాను ఇరవై మూడేళ్ల వయస్సులో ఉన్నపుడే సైన్యంలో చేరాడు. ఆయన భార్య కూడా గెరిల్లాలకు సాయం చేస్తూ తన దేశభక్తిని చాటుకునేది. ఆమెను నాజీలు చిత్రహింసలు పెట్టి ఆమె పసిబిడ్డను ఆమె కళ్లముందే చంపేశారు. తరువాత ఆమెను ఉరి తీశారు. అటుపైన సుహోమ్లీన్‌స్కీ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. ఆయన ఛాతిలో దిగబడిన బాంబు రవ్వలు కొన్ని అక్కడే ఉండిపోయాయి చివరివరకు. ఆయన తన బడికి పెట్టుకున్నపేరు సంతోషచంద్రశాల. అది ఆరుబయట, పచ్చగడ్డి మీద, చెట్టు కొమ్మల క్రింద, ద్రాక్షతోటల్లో నడుస్తూ ఉండేది.

తన పాఠశాలలో చేరే పిల్లల కుటుంబాలన్నిటిని గురించీ వివరంగా తెలుసుకున్నాడు స్కీ. యుద్ధం వలన మానసికంగా, ఆర్థికంగా చితికిపోయిన పిల్లలను ఆయన తండ్రిలాగా చూసుకునేవాడు. "గురువు పిల్లలతో పాటే ఉండాలి. వాళ్ల సుఖదుఃఖాలు స్వేచ్ఛగా చెప్పకోగల అవకాశాన్ని వాళ్లకిచ్చి పంచుకోవాలి, అందులో ఒక మహదానందం ఉంటుంది" అనేవారు ఆయన. పిల్లవాడు బుద్ధితోనే కాదు - 'హృదయంతో కూడా నేర్చుకుంటాడు. బోధన అంటే పిల్లల బుర్రలలోకి వీలయినన్ని విషయాలు కూరే సాధనం. కాదు అలా చేస్తే వాళ్ల సహజ జీవనం దెబ్బ తింటుంది. పాఠశాలల్లో పిల్లల జీవితాన్ని కేవలం చదువుకే అంకితం చేస్తే వారు కుంచించుకుపోతారు. వాళ్ల వ్యక్తిగత సామర్థ్యాలను, ఆసక్తులను అభివృద్ధి చేయడానికి వాళ్లను ప్రకృతిలోకి, కథల్లోకి, కల్పనల్లోకి తీసుకు వెళ్లాలి అనేవారు స్కీ. అనడమే కాదు, తాను కూడా అలాగే చేసేవారు.

"చదువంటే సంతోషాన్ని, సరదాని తెచ్చేది మాత్రమే కాదు. తమ తాత ముత్తాతలు ఎదుర్కొన్న వాటికంటే క్లిష్టమైన సమస్యలను ఎదిరించి





నెగ్గడానికి కావలసిన పట్టుదల విద్యార్థుల్లో నింపాలి. ఈనాటి చదువు మనిషిలోని ఆంతరిక స్పందనలని చంపేస్తుంది. చదువులో హింస ఉండకూడదు" అని పదేపదే అనేవారు స్కీ. "మొదట స్వేచ్ఛగా నిష్కపటంగా ఉపాధ్యాయుడి కళ్లలోకి చూడగలిగిన పిల్లలు కొద్ది నెలలయ్యేప్పటికే ఆ కాంతిని పోగొట్టుకుంటున్నారు. అంత హింస అవసరమా?" అనే వారాయన. పిల్లలందరిని గొర్రెల మందలా కాకుండా ప్రతి పిల్లవాడిలో ఒక ప్రత్యేక వ్యక్తిని దర్శించాలి ఉపాధ్యాయుడు. క్రమశిక్షణతోపాటే పిల్లలలో నేర్చుకోవాలనే జిజ్ఞాసను కలిగించాలని ఆయన భావించేవారు. "పిల్లలు ఇళ్ల దగ్గర కోల్పోయిన బాల్యాన్ని తిరిగి వాళ్లకు ఇవ్వడం నా కర్తవ్యం. వారికి వ్యక్తులుగా తయారయ్యే కళ నేర్పడమే నా ముందరున్న ముఖ్యమైన పరీక్ష. పిల్లవాడు మంచిచెడులను తెలుసుకోవడమే కాదు అతని సున్నిత హృదయం చెడుబారిన పడకుండా చూచుకోవడం కూడా వాళ్లకు నేర్పాలి" అన్నది స్కీ అభిప్రాయం. "నేర్చుకోవడం అన్నది విసుగుపుట్టించేలా ఉండకూడదు. పిల్లల అనుభూతులు, సంకల్పాలు, తార్కిక జ్ఞానం సుసంపన్నం కావాలి. పిల్లవాడు ఆలోచించేలా చేయడం అన్నది ఉపాధ్యాయుడికి ఉండవలసిన అత్యంత ప్రధాన లక్షణాలలో ఒకటి" అని గట్టిగా చెప్పేవారు స్కీ. "పిల్లలను ప్రకృతికి దూరం చేయడం కేవలం మాటలు మాత్రం విని పిస్తూండటం, టి.వి.లు, కంప్యూటర్ల వంటి కృత్రిమ వస్తువుల మధ్య ఉంచడం వల్ల పిల్లలలో సజీవ చైతన్యం లోపిస్తుంది" అనేది సుహోమ్లీన్‌స్కీ ఖండితాభిప్రాయం.

"మంచి తల్లిదండ్రులు అనబడేవారు తమ పిల్లలకి దయ, పరులకు సహాయం చేద్దామన్న తలంపు పెంచుతారు. కొందరు తల్లిదండ్రులు తమ ప్రేమనంతా తమ పిల్లలమీదే ఒలకబోసి చుట్టుప్రక్కల ఇంకా మనుష్యులున్నారన్న సంగతి మర్చిపోతారు. ఇలాంటి ప్రేమ పిల్లలని సరిగా ఎదగనివ్వదు. దుఃఖానికి దారితీస్తుంది. పరుల గురించి పట్టించుకోకుండా

**(మిగతా 28వ పేజీలో)**